మేడ్చల్‌లో ఆటోడ్రైవర్ల ర్యాలీ



మేడ్చల్: మహాలక్ష్మీ పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై ఆంక్షలు పెట్టాలని ఆటో డ్రైవర్లు కోరారు. ఈ సందర్భంగా మేడ్చల్‌లో వివిధ ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు వ్యాపారాలు లేక ఇల్లు గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పథకాన్ని రద్దు చేయాలని, లేని పక్షంలో డ్రైవర్లకు రోజువారిగా రూ.వెయ్యి భృతి చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ గణేశ్

మేడ్చల్‌రూరల్: గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని మునీరాబాద్ గ్రామ సర్పంచ్ చిట్టిమిల్ల గణేశ్ తెలిపారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. సభలో గ్రామంలోని సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఆదర్శ గ్రామంగా అవార్డు పొందిన గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఉపసర్పంచ్ నర్సింగ్ రావు, అధికారులు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల భోజనంలో నాణ్యత ఉండాలి

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందజేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడి విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనానికి సంబంధించిన మెనూ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఈ సీజన్‌లో మెనూ ప్రకారం వేడివేడిగా మధ్యాహ్న భోజనాన్ని అందజేయాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అన్నారు.

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసిన పీఆర్‌టీయూ నాయకులు



బుర్ర వెంకటేశంగౌడ్‌తో పీఆర్‌టీయూ నాయకులు

శామీర్‌పేట్: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించిన బుర్రా వెంకటేషంగౌడ్‌ను మాజీ ఎంఎల్‌సీ కాటెపల్లి జనార్దన్ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 317 జీఓ ద్వారా ఇతర జిల్లాల ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

మల్లాపూర్: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధిరులకు సూచించారు. బుధవారం ఓల్డ్ మల్లాపూర్‌లోని సంజీవయ్య పార్క్ వద్ద రూ.13 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పన, ప్రజా సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, స్థానిక నేతలు వాసుగౌడ్, వై.మల్లేష్, ప్రకాష్, నర్సింగ్‌రావు, రాపోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య



ప్రభాకర్ (ఫైల్)

పోచారం: ఆర్థిక ఇబ్బందులతో రాజీవ్ గృహకల్పకు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోచారం పోలీస్ స్టేషన్ సీఐ వి.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీ 23వ బ్లాక్‌లో నివసిస్తున్న బేతి ప్రభాకర్(34) కర్మన్‌ఘాట్‌లోని వీఎస్‌ఆర్ ప్రాజెక్ట్స్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం విధులకు వెళ్లి తిరిగి రాలేదు. అదే రోజు రాత్రి సుమారు 11 గంటల సమయంలో భార్య శ్రీలక్ష్మికి ఫోన్ చేసి తాను ఎప్పటికీ ఇంటికి తిరిగి రానని సమాచారం ఇచ్చి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. ఈ విషయాన్ని పోలీసులకు తెలపడంతో అదృశ్యం కేసుగా ఫిర్యాదు తీసుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఈగలపేట వద్ద ప్రభాకర్ ఉనికి తెలియడంతో పోలీసు బృందం వెళ్లి వెతికింది. సమీపంలోని అటవీ ప్రాంతంలో అతడి ద్విచక్రవాహనంతో పాటు మృతదేహం దొరికింది. ఆర్థిక ఇబ్బందులతో ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తామని పోలీసులు బుధవారం తెలిపారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

కుషాయిగూడ: గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చర్లపల్లి పారిశ్రామిక వాడ ఫేస్–1లో సుమారు 60 సంవత్సరాల వయసు కలిగిన ఓ వృద్ధుడు రోడ్డు పక్కన పడిపోయి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వ్యక్తులు చర్లపల్లి పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అధికారుల్లో బదిలీల భయం..

- అప్పటి ప్రభుత్వానికి అనుకూలంగా కొందరు..
- రాష్ట్రస్థాయిలో కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ
- త్వరలో జిల్లా, మండల, డివిజన్ స్థాయికి..
- ఇప్పటికే జాబితా సిద్ధమైనట్లు సమాచారం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పలువురు అధికారులు



మేడ్చల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఆయా శాఖల్లో కీలక పదవుల్లో కొనసాగుతున్న అధికారులకు స్థానచలనం మొదలైంది. దాంతో స్థానికంగా పలు పోస్టుల్లో ఏళ్లుగా కొనసాగుతున్న అధికారుల్లో గుబులు మొదలైంది. బదిలీల ప్రక్రియ మండల, డివిజన్ స్థాయి వరకూ వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరగడంతో కొంతమంది అధికారులు తమకు ఏ ప్రాంతంలో పోస్టింగ్ వస్తుందో అని ఆందోళన చెందుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉన్న అధికారులను నియమించుకోవడంతో ఎన్నికల సంఘం అధికారులను మార్చింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అప్పటి ప్రభుత్వానికి కొంత అనుకూలంగా ఉన్న అధికారుల్లో ఆందోళన మొదలైంది. పాత అధికారులు తిరిగి తమ మాతృ శాఖల్లో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నా అధికార కాంగ్రెస్ నాయకులు అడ్డుపుల్లలు వేస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నికలకు ముందు రెవెన్యూ, పోలీస్‌శాఖల్లో మార్పులు బాగానే చేసుకున్నాయి. మిగతా శాఖల్లో పెద్దగా మార్పులు లేకున్నా అధికారుల బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

బీఆర్‌ఎస్ నాయకులు ప్రమోట్ చేసిన వారే..

మేడ్చల్ నియోజకవర్గంలో ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు, ఐదు మండలాలు ఉండగా అన్నింటిలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మేయర్, చైర్మన్, ఎంపీపీలుగా ఉన్నారు. మేడ్చల్ నియోజకవర్గం సైబరాబాద్, రాచకొండ రెండు కమిషనరేట్ పరిధిలో ఉన్నాయి. 10 ఏళ్లుగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉండటం, స్థానికంగా బీఆర్‌ఎస్ నాయకులు ప్రమోట్ చేసిన వారే అధికారులుగా ఉండటం కనిపించింది. కాంగ్రెస్ నాయకులు తమ మాట వినే, తమకు అనుకూలంగా ఉండే అధికారులను నియమించుకోవాలని పావులు కదుపుతున్నారు. కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన వజ్రేష్‌యాదవ్ ఎన్నికల సమయంలో కొంతమంది అధికారులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా పనిచేస్తున్నారని, కొంతమంది పోలీస్ శాఖ అధికారులకు, మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న అధికారులను ఆయన హెచ్చరించారు.

పాలనపై పట్టు కోసం..

కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలో జెడ్పీ చైర్మన్ మినహా, ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్, కార్పొరేషన్ల మేయర్లు లేకపోవడంతో పాలనపై పట్టు కోసం అధికారులను అడ్డుపెట్టుకుని రాబోయే కాలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టుసాధించాలనే ఆలోచనలతో అగ్ర నేతలు వజ్రేష్ యాదవ్, సుధీర్‌రెడ్డి తమకు అనుకూలంగా ఉండే అధికారుల చిట్టా తయారు చేశారని సమాచారం. ఎవరిని ఉంచాలి.. ఎవరిని ఎక్కడకు పంపాలి వంటి జాబితా సిద్ధం చేసి అధిష్టానానికి అందజేసినట్లు సమాచారం. ప్రధానంగా తహసీల్దార్లు, సీఐలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓల బదిలీలపై కాంగ్రెస్ నాయకులు పట్టుబడుతున్నారని అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది.

మంత్రికి అభినందనలు



కుషాయిగూడ: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు పోలేపాక అంజయ్య, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, పోలగాని శ్రావణ్‌కుమార్‌గౌడ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

పైపులైన్, డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం సర్వే

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని ఎంహెచ్‌ఆర్ కాలనీలో మంజీరా లైన్, డ్రైనేజీ నిర్మాణం కోసం జలమండలి మేనేజర్ రమేష్ సర్వే చేశారు. త్వరలో పైపులైన్, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు సంతోష్ రెడ్డి, కృష్ణ, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించేందుకే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



ఎంపిక చేసిన సమస్యను సాధించే పనిలో నిమగ్నమైన విద్యార్థి బృందాలు

పోచారం: విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఏఐసీటీఈ, భారత విద్యామంత్రిత్వ శాఖల సౌజన్యంతో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ నిర్వహించారు. యంనంపేట్‌లోని శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(స్నిస్ట్)లో రెండు రోజుల పాటు సాగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2023 గ్రాండ్‌ఫినాలే బుధవారం ముగిసింది. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు హ్యాకథాన్ ముఖ్య ఉద్దేశ్యమని అధ్యాపకులు చెప్పారు. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన 200 మంది విద్యార్థులు, 40 మంది మెంటర్స్(మార్గదర్శకులు), 15 జ్యూరీ బృందాల(న్యాయనిర్ణేతలు) భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతమైంది. అందుకు శ్రీనిధి వేదిక కావడంపై కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో స్నిస్ట్ డైరెక్టర్ ప్రొ.సీవీ టోమీ, ప్రిన్సిపాల్ డా.టీసీహెచ్ శివారెడ్డి, ఇన్నోవేషన్ డీన్ డా.శృతి భార్గవ చౌబే తదితరులు పాల్గొన్నారు.

వసతులను సద్వినియోగం చేసుకోవాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో తనిఖీలు
- బస్తీ దవాఖానాలో రికార్డుల పరిశీలన
- మునిసిపల్ అధికారులతో సమీక్ష



ప్రగతినగర్‌లో పార్కులో మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

నిజాంపేట్: ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటు చేసి వసతులను సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని, మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం ఆయన నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్యటించారు. ఈ సందర్భంగా పార్కులు, బస్తీ దవాఖానాలను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ముందుగా ప్రగతినగర్ పరిధిలో ఉన్న పార్కులను సందర్శించిన కలెక్టర్ గౌతమ్ పార్కులో మొక్కలు, వాకింగ్ ట్రాక్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే ప్రాంతంలో ఉన్న క్రీడా మైదానాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ప్రజలకు మంచి ఆరోగ్యం కల్పించడంతో పాటు వారికి అన్ని రకాలుగా సౌకర్యవంతంగా ఉండేలా అర్బన్ పార్కులను ఏర్పాటు చేసిందన్నారు.

◆ బస్తీ దవాఖానా తనిఖీ

ప్రగతినగర్లో బస్తీ దవాఖానాను జిల్లా కలెక్టర్ గౌతమ్ అకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన పలువురు రోగులను పలకరించి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చే ప్రజలతో సిబ్బంది ఆత్మీయంగా మాట్లాడాలని, అప్పుడే ప్రజలకు వైద్యుల పట్ల గౌరవం పెరుగుతుందన్నారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులు, రిజిష్టర్లు, మందులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఆసుపత్రి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి అవసరమైన మందులను తెప్పించుకోవాలని వైద్యాధికారిని ఆదేశించారు. ల్యాబ్‌లో దయాగ్నస్టిక్‌కు సంబంధించి వస్తున్న రోజువారి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో..

◆ మున్సిపల్ అధికారులతో సమీక్ష..

నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లో జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆయా విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందేందుకు అందరి సహకారం అవసరమన్నారు. సకాలంలో మున్సిపల్ టాక్స్‌లు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా మున్సిపల్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు తగినన్ని నిధులు సమకూరతామన్నారు. పార్కులు, రోడ్లు, డ్రైనేజీ తదితర ముఖ్య వసతులను ఎప్పటికప్పుడు మెరుగు పరచాలని, ప్రజలకు అన్ని సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో నిజాంపేట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, బాచుపల్లి తహశీల్దార్ పుల్ సింగ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు అక్రమం.. ఇప్పుడు సక్రమమా?



అవుషాపూర్‌లో ప్రస్తుతం నిర్మించిన ప్రహరి గోడ



అవుషాపూర్‌లో ప్రహరి గోడను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)

ఘట్‌కేసర్: అవుషాపూర్ సర్వే నంబర్ 349లోని 28 గుంటల ప్రభుత్వ భూమిలో అక్రమంగా ప్రహరీ నిర్మిస్తున్నారని పంచాయతీ పాలకవర్గ సభ్యులు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో సెప్టెంబర్ 23న రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. నాలుగు నెలల అనంతరం అదే ప్రదేశంలో తిరిగి గోడ నిర్మించంతో వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అక్రమ నిర్మాణమని కూల్చివేశారని, ప్రస్తుతం ఎలా సక్రమం అవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కృష్ణను వివరణ కోరగా ప్రహరీ నిర్మించిన విషయం తమ దృష్టికి రాలేదని, చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన హరివర్ధన్‌రెడ్డి



మేడ్చల్: మంత్రి సీతక్కను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆమె నివాసంలో కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన మంత్రి సీతక్కను కోరారు.

ఉచిత వైద్య పరీక్షలు



మేడ్చల్: పట్టణంలోని సంప్రద ప్రైవేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అయ్యప్ప ఆలయం వద్ద ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి అయ్యప్ప దీక్షలు తీసుకున్న వారికి, ఇతరులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సింహాస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



దానకిషోర్‌ను సత్కరిస్తున్న టీఎన్‌జీవో నాయకులు

జవహర్‌నగర్: టీఎన్‌జీవో రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్‌ను కలిసి పూలమొక్క అందజేసి సత్కరించారు. అనంతరం మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి చేయూత



పుస్తె, మెట్టెలు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, నాగరాణి

జవహర్‌నగర్: పేద యువతి వివాహానికి చేయూత అందించడం ఆనందంగా ఉందని డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ వికలాంగుల కాలనీలో నివసిస్తున్న సుగుణ కుమార్తె కౌసల్య వివాహానికి డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, ఆయన సతీమణి నాగరాణి బుధవారం పుస్తె, మెట్టెలు, నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో బుడిగె సవితగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యేసు బోధనలు ఆచరణీయం

రామంతాపూర్: అరోరా(అటానమస్) పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ సంబరాల్లో విద్యార్థులు యేసుక్రీస్తు జననం నాటికను ప్రదర్శించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ యేసుక్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. క్రిస్మస్ పండగ సహనం, మానవత్వం ప్రాముఖ్యతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. డాక్టర్ సీహెచ్ సతీష్ కుమార్, దేవేందర్‌రావు పాల్గొన్నారు.

డాటా సైన్స్‌లో ఉద్యోగావకాశాలు పుష్కలం

యల్టీఐ మైండ్‌ట్రీ సీనియర్ మేనేజర్ వీఎస్‌ఆర్ ప్రసాద్ ఓరుగంటి



ముఖ్యఅతిథులతో సదస్సులో విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్: డాటా సైన్స్‌లో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉంటాయని యల్టీఐ మైండ్‌ట్రీ సీనియర్ మేనేజర్ వీఎస్‌ఆర్ ప్రసాద్ ఓరుగంటి అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో డాటా సైన్స్ స్టూడెంట్ చాప్టర్, యల్టీఐ మైండ్‌ట్రీ సహకారంతో బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థులకు డాటా సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు బుధవారం నిర్వహించిన 'ఇన్‌సైట్స్ ఆన్ డాటా సైన్స్' సదస్సుకు ప్రొఫెసర్ విజయ్‌కుమార్, డీన్ శ్రీదేవితో కలిసి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాటా సైన్స్ ఉపయోగం, ఉద్యోగావకాశాలు, డాటా ఎనలాటిక్స్, డాటా విజువలైజేషన్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

సఖీ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జెండర్ స్పెషలిస్ట్

మేడ్చల్: సఖీ కేంద్ర సేవలను అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని జెండర్ స్పెషలిస్ట్ వాసవి అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మీటింగ్‌లో టీచర్లు, సూపర్‌వైజర్లకు బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్ట్ వాసవి మాట్లాడుతూ మహిళలు, బాలికల కోసం సఖీ కేంద్రం ఎన్నో సేవలను అందిస్తోందని, వాటిపై అవగాహన పెంచుకొని సద్వినియోగం అయ్యేలా చూడాలని కోరారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు సుకన్య సమృద్ధి యోజన, ముద్ర యోజన, అటల్ పెన్షన్, బాల్యవివాహాల నివారణ, చైల్డ్ హెల్ప్‌లైన్, లైన్ నంబర్ వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, సీడీపీఓ ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం చేస్తున్నాం

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా, సాఫీగా నిర్వహించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టేందుకు సంబంధిత అధికారులు, సిబ్బందిని సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా నిర్వహణపరమైన ఏర్పాట్లపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. ఈ నెలాఖరు నాటికి నిర్దేశించిన అంశాలతో కూడిన వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. బుధవారం కలెక్టర్లు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాబోయే పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. ఈ నెల 25లోపు అన్ని దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటిస్తూ.. సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఈఆర్వోలు, ఎన్నికల అధికారులు, ఎన్నికల విభాగం అధికారి రాజేశ్వర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాలాజీ బ్రహ్మోత్సవాలు

అల్వాల్: అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అల్వాల్ పురవీధుల్లో పల్లకీ సేవ ద్వారా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సామాజికవేత్తలు వెంకటరామిరెడ్డి, శివకృష్ణ, సురేందర్‌రెడ్డి, రాము, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు శుభాకాంక్షలు

అల్వాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు విక్రమ్‌గౌడ్‌తో పాటు జాజుల శ్రీనివాస్ కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ ఉద్యమంలో అనేకసార్లు ప్రత్యక్షంగా పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాత జ్ఞాపకాలను గుర్తుచేశామన్నారు. అతి త్వరలోనే అన్ని సమస్యల పరిష్కానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు విక్రమ్‌గౌడ్ తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387